
మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ నేత చింతల వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు

## కేసీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ నేత చింతల

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 18: బీఆర్ఎస్ పార్టీ అధినేత, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌ను ఎర్రవెల్లిలోని ఆయన నివాసంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, రాజపుష్పం కన్‌స్ట్రక్షన్ ఎండీ మహేందర్‌రెడ్డి శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ నెల 24న మహేందర్‌రెడ్డి కుమారుడి వివాహం జరుగనున్న నేపథ్యంలో కేసీఆర్‌కు ఆహ్వాన పత్రిక అందించారు.


రాజాపేటలో విశ్రాంత ఉపాధ్యాయుడు వెంకటయ్యను బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

## బీఆర్ఎస్‌లో చేరిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు

రాజాపేట, ఏప్రిల్ 18 : మండలంలోని బొందుగుల గ్రామానికి చెందిన రిటైర్డ్ హెడ్ మాస్టర్ ఇప్ప వెంకటయ్య శుక్రవారం ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమ నేత కేసీఆర్ నాయకత్వానికి ఆకర్షితుడినై బీఆర్ఎస్‌లో చేరినట్లు తెలిపారు.

కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, సట్టు తిరుమలేశ్, మర్ల నాగరాజు, కొమ్ము పాండు, ఇప్ప సిద్దులు, ఇప్ప వెంటకయ్య, సిద్ధు ముదిరాజ్, బాల్ద నర్సయ్య, బాల్ద సిద్దులు పాల్గొన్నారు.


రాజాపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

## రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

- ప్రభుత్వ విప్ బీర్ల ఐయిలయ్య

రాజాపేట, ఏప్రిల్ 18 : రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రతి బియ్యపు గింజను కొనుగోలు చేయాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐయిలయ్య అన్నారు. రాజాపేట మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ చైతన్యరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ చింతలపూరి భాస్కర్ రెడ్డి, వైస్ చైర్మన్ కాకాల ఉపేందర్ రైతులు పాల్గొన్నారు.

భూదాన్ పోచంపల్లి : మండలంలోని జలాల్ పూర్ గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రారంభించారు.

### కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి – డీసీసీబీ చైర్మన్

చౌటుప్పల్ : ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మండలపరిధిలోని తాళ్లసింగారం, గుండ్లబావి, అంకిరెడ్డిగూడెం, పంతంగి గ్రామాల్లోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సింగిల్ విండో, మార్కెట్ కమిటీల చైర్మన్లు చింతల దామోదర్ రెడ్డి, ఉబ్బు వెంకటయ్య, వైస్ చైర్మన్లు చెన్నగోని అంజయ్య గౌడ్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆడిట్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ జె.యాకయ్య

## ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి : యాకయ్య

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 18 : పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల అన్ని బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఆడిట్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ జె.యాకయ్య అన్నారు. పట్టణంలోని సుందరయ్య భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కనీసం 15శాతం నిధులు కేటాయించాలని, వచ్చే విద్యా ఏడాది నుంచే ప్రాథమిక పాఠశాలల బలోపేతానికి ప్రత్యేక కేంద్రీకరణ జరుగాలని, పూర్వ ప్రాథమిక తరగతులను ప్రారంభించాలన్నారు. వేసవి సెలవుల్లోనే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. పర్యవేక్షణ వ్యవస్థను పటిష్టం చేసి, ఖాళీగా ఉన్న డీఈఓ, డిప్యూటీ డీఈఓ పోస్టులను ప్రమోషన్ ద్వారా భర్తీ చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో, ఎన్నికల మ్యానిఫెస్టోను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న 5 డీఏలను విడుదల చేయాలని, పీఆర్సీ నివేదిక తెప్పించి సంఘాలతో చర్చించి అమలు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ముక్కర్ల యాదయ్య, ప్రధాన కార్యదర్శి మెతుకు సైదులు, ఉపాధ్యక్షుడు అక్కనపల్లి వెంకటాచారి, కోశాధికారి ముత్యాలు, ఎఫ్డబ్ల్యూఎఫ్ కన్వీనర్ కంచి రవికుమార్, జిల్లా కార్యదర్శులు కె.శ్రీనివాస్, శ్రీదేవి, ఆడిట్ కమిటీ కన్వీనర్ దొడ్డి రవి, సోషల్ మీడియా కన్వీనర్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలి : ఫైర్ ఆఫీసర్

రామన్నపేట, ఏప్రిల్ 18 : అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక మండల అధికారి మధుసూదన్‌రెడ్డి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం స్థానిక ప్రభుత్వ దవాఖానలో సిబ్బంది, రోగులకు డెమో ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఓ, లీడింగ్ ఫైర్‌మెన్ రామనర్సయ్య, మిర్జా షఫిబేగ్, రవి, కృష్ణ, పాండు, నరేశ్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.


రామన్నపేట ప్రభుత్వ దవాఖానలో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్ని మాపక సిబ్బంది

మోత్కూరు : మున్సిపల్ కేంద్రంలోని ఓ పెట్రోల్ బంక్‌లో అగ్ని మాపక అధికారులు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్, ఆర్ భీముడు, సిబ్బంది ఎస్ రామచంద్రయ్య, సీహెచ్ జితేందర్, బీ రవీందర్‌నాయక్, మహేందర్‌రెడ్డి, అంజయ్య పాల్గొన్నారు.


మోత్కూరులో..

# రజతోత్సవ సభకు సైనికుల్లా కదం తొక్కాలి

- డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

ఆలేరు టౌన్, ఏప్రిల్ 18 : బీఆర్ఎస్ పార్టీ 24 ఏండ్లు పూర్తి చేసుకొని 25వ వసంతంలోకి అడుగిడుతున్న సందర్భంగా వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహిస్తున్న రజతోత్సవ సభకు పార్టీ శ్రేణులు సైనికుల్లా కదం తొక్కాలని డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణ కేంద్రంలోని దొంతిరి సోమిరెడ్డి గార్డెన్స్‌లో బీఆర్ఎస్ మండల, పట్టణ స్థాయి నాయకులు, కార్యకర్తల సన్నాహక సమావేశాన్ని శుక్రవారం నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. అమలు కాని 420 హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని ఆయన మండి పడ్డారు. దేశంలోనే ఏ ముఖ్యమంత్రి తినని తిట్లు రేవంత్‌రెడ్డి తినడం కాంగ్రెస్ దౌర్భాగ్యమని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కల్లూరి రామచంద్రారెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు గంగుల శ్రీనివాస్, పట్టణాధ్యక్షుడు పుట్ట మల్లేశం గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ మొగులుగాని మల్లేశం, వైస్ చైర్మన్ చింతకింది చంద్రకళ, మున్సిపల్ మాజీ చైర్మన్ వస్పరి శంకరయ్య, మాజీ జడ్పీటీసీ బొట్ల పరమేశ్వర్, దొంతిరి సోమిరెడ్డి, బక్క రామ్ ప్రసాద్, జూకంటి ఉప్పలయ్య, నాయకులు గ్యాదపాక నాగరాజు, పంతం కృష్ణ, కుండే సంపత్, మామిడాల భాను, కోటగిరి పాండారి, ఆడెపు బాలస్వామి, బండి నరేందర్ పాల్గొన్నారు.



ఆలేరు టౌన్ : సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, వేదికపై మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్యగౌడ్, బీఆర్ఎస్ నేత కల్లూరి రామచంద్రారెడ్డి

### సభకు పెద్దఎత్తున తరలి రావాలి : యాదయ్య

మోటకొండూర్ : బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బొట్ల యాదయ్య శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. సభ జయప్రదం చేయాలని కోరుతూ నేడు మండల కేంద్రంలోని ఫంక్షన్‌హాల్‌లో పార్టీ సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి ప్రభుత్వ విప్, మాజీ ఎమ్మెల్యే సునీత, డీసీసీబీ మాజీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్యగౌడ్, రాష్ట్ర నాయకుడు కల్లూరి రామచంద్రారెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు.

మోత్కూరు : రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పొన్నెబోయిన రమేశ్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయ ఆవరణలో రజతోత్సవ సభకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొణతం యాకూబ్‌రెడ్డి, మున్సిపాలిటీ అధ్యక్షుడు జంగ శ్రీను, ప్రధాన కార్యదర్శి గజ్జి మల్లేశ్, రైతుబంధు మండల సమితి మాజీ కో ఆర్డినేటర్ కొండ సోంమల్లు, నాయకులు మర్రి అనిల్‌కుమార్, దాసరి తిరుమలేశ్, నేర్లకంటి మత్స్యగిరి, పురుగుల మల్లయ్య, సామ పద్మారెడ్డి, అన్నందాసు విద్యాసాగర్, జంగ శివ, వెంకన్న, హరీశ్ పాల్గొన్నారు.

### వాల్ పెయింటింగ్

రాజాపేట : ఈనెల 27న వరంగల్‌లో జరిగే రజతోత్సవ సభను విజయవంతం చేయాలని మండలంలో శుక్రవారం గోడలపై వాల్ పెయింటింగ్ చేశారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సట్టు తిరుమలేశ్ స్వయంగా గోడలపై కేసీఆర్ నాయకత్వం వర్ధిల్లాలని రాశారు. అనంతరం మాట్లాడుతూ సభకు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు ఎడ్ల బాలలక్ష్మి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాకాల ఉపేందర్, నాయకులు జశ్వంత్ పాల్గొన్నారు.

### పోస్టర్ ఆవిష్కరణ

అడ్డగూడూరు : వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభ పోస్టర్లను శుక్రవారం బీఆర్ఎస్ పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శి గజ్జెల్లి రవి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గోడలకు అంటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ సభకు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

### రేపు మహాసభ సన్నాహక సమావేశం

బొమ్మలరామారం : ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ కోసం 20వ తేదీన మండల సన్నాహక సమావేశం యావాపూర్ గ్రామంలో గల యువ డిఫెన్స్ కళాశాలలో నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పోలగాని వెంకటేశ్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం పార్టీ మండల కమిటీ సమావేశం ఆయన ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సన్నాహక సమావేశానికి మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునితామహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్, జడ్పీ మాజీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్లమెంట్ ఇన్‌చార్జి క్యామ మల్లేశ్, రాష్ట్ర నాయకులు కల్లూరి రాంచంద్రారెడ్డి, సూదగాని హరిశంకర్ గౌడ్ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని పార్టీ కార్యకర్తలు, నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, అన్ని విభాగాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కుషంగల సత్యనారాయణ, జూపల్లి భరత్, బండి మహేశ్ గౌడ్, మల్లేశ్, రామకృష్ణ, పాపరెడ్డి, గణేశ్, పాండు, ఉపేందర్ పాల్గొన్నారు.


రాజాపేటలో వాల్ పెయింటింగ్ వేస్తున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సట్టు తిరుమలేశ్


అడ్డగూడూరులో రజతోత్సవ సభ పోస్టర్లను గోడలకు అంటిస్తున్న బీఆర్ఎస్ నాయకులు


మోత్కూరు : బీఆర్ఎస్ రజతోత్సవ సభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి

## భూదానోద్యమం ప్రపంచానికే స్ఫూర్తి : ఎమ్మెల్యే

భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 18 : భూదానోద్యమం ప్రపంచానికి స్ఫూర్తి అని, ఎంతో మంది పేదల జీవితాల్లో వెలుగులు నింపిందని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణ కేంద్రంలో శుక్రవారం భూదాన్ జయంతి వజ్రోత్సవంలో భాగంగా వినోబా మందిరంలో శాంతి యజ్ఞం నిర్వహించగా ఎమ్మెల్యే హాజరై వినోబా బావే, ప్రథమ భూదాత వెదిరె రామచంద్రారెడ్డి విగ్రహాలకు నివాళులర్పించారు. అనంతరం వినోబా నగర్ డెవలప్‌మెంట్ సొసైటీ గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన భూభారతి, భూదాన భూముల పరిష్కారాలపై అవగాహన సదస్సులో మాట్లాడారు. అనంతరం రూ. 9.60 కోట్ల నిధులతో పోచంపల్లిలో మినీ ట్యాంక్ బండ్ నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోదండరాం రెడ్డి, భూభారతి కమిటీ సభ్యులు సునీల్ కుమార్, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ చైర్మన్ గున్న రాజేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి యానాల ప్రభాకర్‌రెడ్డి, ప్రొఫెసర్ తడక యాదగిరి, మున్సిపల్ కమిషనర్ అంజన్ రెడ్డి, డీటీ నాగేశ్వర్‌రావు, ఆర్ఐ వెంకట్ రెడ్డి, కవి రచయిత కె. గోపాల్, నాయకులు పాల్గొన్నారు.

## భూదాన భూములను పరిరక్షించాలి : చందన్‌పాల్

భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 18 : భూస్వాముల నుంచి సేకరించి, పేదల జీవనోపాధి కోసం పంపిణీ చేసిన భూదానోద్యమ భూములను పరిరక్షించాలని జాతీయ సర్వ సేవా సంఘ్ అధ్యక్షుడు చందన్ పాల్, మాజీ ఎంపీ అజీజ్ పాషా ప్రభుత్వాన్ని కోరారు. పట్టణ కేంద్రంలోని టూరిజం హాల్‌లో తెలంగాణ, ఏపీ సర్వోదయ మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం భూదాన వజ్రోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు వెదిరె రామచంద్రారెడ్డి విగ్రహానికి నివాళులర్పించి మాట్లాడుతూ మహారాష్ట్రలో పుట్టి దేశం కోసం జీవితాన్ని త్యాగం చేసిన వినోబాబావే ఆశయాన్ని రియల్టర్లు, స్వార్థ రాజకీయ నాయకులు నిర్వీర్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్వోదయ మండలి అధ్యక్షుడు నీలం రాంబాబు నాయుడు, షేక్ హుస్సేన్, కృష్ణ ప్రసాద్, గిరిప్రసాద్, దీనబంధు, ఎస్ యాదమ్మ, ఎన్. దత్తమణి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జాతీయ సర్వసేవా సంఘం అధ్యక్షుడు చందన్‌పాల్


సమావేశంలో మాట్లాడుతున్న కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయరాములు

## గీత కార్మికుల సంక్షేమాన్ని మరిచిన ప్రభుత్వం : జయరాములు

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 18 : ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి గీత కార్మికుల సంక్షేమం కోసం పాటు పడుతామని హామీ ఇచ్చి ఇప్పుడు మర్చిపోయారని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొలగాని జయరాములు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గీత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం అధిక మొత్తంలో నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వృత్తిలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియాను పెంచి, గాయపడితే చికిత్స నిమిత్తం తక్షణ సాయం అందించాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చెరుకు మల్లేశం, గీతపారిశ్రామిక సహకార సంఘం గ్రామ అధ్యక్షుడు పంజాల నర్సయ్యగౌడ్, కల్లుగీత కార్మిక సంఘం మండల గౌరవాధ్యక్షుడు గడ్డం దశరథగౌడ్, మండలాధ్యక్షుడు రంగ సత్యనారాయణగౌడ్, అయిలయ్య పాల్గొన్నారు.

## బాలికపై లైంగికదాడికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి : ప్రకాశ్

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 18 : ఉత్తరప్రదేశ్‌లోని రాంపూర్‌లో బధిర బాలికపై లైంగికదాడికి పాల్పడిన దాన్‌సింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు సురూపంగా ప్రకాశ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఎన్‌పీఆర్‌డీ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్, బొల్లపల్లి స్వామి, కొత్త కవిత, మనోహర, పద్మ, పార్వతి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సురూపంగా ప్రకాశ్

## ట్రాక్టర్ కింద పడి వ్యక్తి మృతి


గంగాపురం రామకృష్ణ (ఫైల్)

గుండాల, ఏప్రిల్ 18 : మండలంలోని బండకొత్తపల్లి గ్రామంలో గురువారం రాత్రి ట్రాక్టర్ కింద పడి వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన గంగాపురం రామకృష్ణ(38) గురువారం రాత్రి తన పొలంలో వరి కోతలు ముగించుకుని ధాన్యాన్ని ట్రాక్టర్ ద్వారా కొనుగోలు కేంద్రానికి తరలించాడు. ఐకేపీ కేంద్రంలో ఖాళీ చేసి రివర్స్ తీస్తున్న క్రమంలో ట్రాక్టర్ అదుపు తప్పి పక్కనే ధాన్యం కుప్ప పైకి ఎక్కింది. దీంతో ట్రాక్టర్‌పై ఉన్న రామకృష్ణ జారి అదే వాహనం కింద పడి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సుమారు గురువారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఘటన జరగ్గా రామకృష్ణ మృతదేహాన్ని శుక్రవారం ఉదయం గ్రామస్తులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ సైదులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతుడి తండ్రి సోమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మోటకొండూర్, ఏప్రిల్ 18 : మండల కేంద్రంలో వర్టూర్ రోడుపై శుక్రవారం రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ నాగుల ఉపేందర్‌యాదవ్ తెలిపిన వివరాలు.. వర్టూర్ గ్రామానికి చెందిన పల్లె సోమేశ్వర్ తన బైక్‌పై వ్యక్తిగత పని నిమిత్తం మండల కేంద్రానికి వచ్చి తిరిగి ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యంలో ఎదురుగా వస్తున్న మహేంద్రా ట్రాలీ వాహనాన్ని వేగంగా వచ్చి ఢీ కొట్టాడు. ఈ ఘటనలో సోమేశ్వర్ తల, కాళ్లకి తీవ్ర గాయాలు కాగా 108 వాహనంలో పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం భువనగిరి ఏరియా దవాఖానకు అక్కడి నుంచి హైదరాబాద్‌లో గాంధీ దవాఖానాకు తరలించారు. సోమేశ్వర్ తండ్రి ఉప్పలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## హైలెవల్ బ్రిడ్జి పనులు ప్రారంభం

ఆలేరురూరల్, ఏప్రిల్ 18 :మండలంలోని కొలనుపాకలో రూ.4.50కోట్లతో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులను ప్రభుత్వవిప్ బీర్ల అయిలయ్య ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని గుండెబాల్ నర్సమ్మ ఇంట్లో భోజనం చేసి సన్న బియ్యం పథకం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు.


యాదగిరిగుట్ట పట్టణంలో కురుస్తున్న వర్షం

## పలుచోట్ల వర్షం


రాజాపేట : రేణికుంటలో పిడుగుపాటుకు మృతి చెందిన మేకలు

యాదగిరిగుట్ట, ఏప్రిల్18 : పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షానికి విద్యుత్‌కు అంతరాయం కలిగింది. పలు ప్రాంతా ల్లో పెద్ద శబ్దంతో ఉరుముల రావడంతో ప్రజలు భయపడ్డారు. పలుచోట్ల కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిసింది.

రాజాపేట : మండలంలోని రేణికుంటలో బండి మల్లయ్యకు చెందిన 40 మేకలు, 10 గొర్లు పిడుగుపాటుతో మృతి చెందాయి. వీటి విలువ సుమారు రూ.4లక్షలు ఉంటుందని మల్లయ్య తెలిపాడు.

## ఆర్థిక సాయం


నర్సింహ కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు పాశం మహేశ్

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 18 : మండలంలోని కూనూరు గ్రామానికి చెందిన తాళ్లపల్లి నర్సింహ ఇటీవల మృతిచెందగా ఆయన కుటుంబానికి దాతల సహకారంతో రూ.16వేల ఆర్థికసాయాన్ని బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు పాశం మహేశ్ శుక్రవారం అందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, దాతలు మాటూరు సత్యనారాయణ, వడి వెంకటేశ్, బుగ్గ సురేశ్ కుమార్, బుగ్గ శంకర్, నుచ్చు వెంకటేశ్, నుచ్చు చిన్న మల్లేశ్ తదితరులున్నారు.

## వేతన బకాయిలు చెల్లించాలి : స్వామి


సమావేశంలో మాట్లాడుతున్న గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకుడు స్వామి

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 18 : గ్రామ పంచాయతీ సిబ్బందికి బకాయి వేతనాలను చెల్లించడంతో పాటు ప్రతి నెలా 1వ తేదీన ట్రెజరీ ద్వారా వేతనాలు అందించాలని గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ నోముల స్వామి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ వేతనాల కోసం ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని, జీఓ నంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేసి అర్హుల కారోబార్లు, బిల్లు కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని కోరారు. సమావేశంలో యూనియన్ మండలాధ్యక్షుడు కూరెళ్ల కిష్టయ్య, యాదయ్య, లక్ష్మయ్య, శ్రీను, మత్స్యగిరి, జ్ఞానేశ్వర్, నర్సయ్య పాల్గొన్నారు.

## తల్లిదండ్రులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిది : సీఐ మన్మథ


తల్లిదండ్రుల సంరక్షణ చట్టం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐ

చౌటుప్పల్, ఏప్రిల్ 18 : తల్లిదండ్రులను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సీఐ మన్మథకుమార్ అన్నారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ మండల శాఖ ఆధ్వర్యంలో తల్లిదండ్రుల సంరక్షణ సంక్షేమ చట్టం 2007, నియమావళి అంశాలకు సంబంధించిన పోస్టర్‌ను సీఐ ఆవిష్కరించి మాట్లాడారు. పిల్లలు వారసత్వంగా పొందిన ఆస్తులను కూడా తిరిగి రద్దు చేసే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రగుంట వెంకటేశం, కోశాధికారి దుర్గాయ నర్సింహారావు, మండల అధ్యక్షుడు కానుగల వెంకటయ్య, నాయకులు గోశిక లక్ష్మయ్య, బొమ్మిడి సత్తిరెడ్డి, ఎండీ ఖలీల్ పాల్గొన్నారు.